# హృదియ

రచన :
శ్రీ బి. వి. డి. ప్రసాదరావు

(గతసంచిక తరువాయి)

ముసలాయన కనిపించారు. నన్నుచూసి పలకరించారు. అతను చూపించగా నే నా కుర్చీలో కూచున్నాను.

'నిన్ను ఎలా అభినందించాలో అర్థం కావడంలేదు. బాబూ ! నువ్వు ఎంతగానో నన్ను సంతోషపరిచావు. నీమూలంగానే హృదియ మళ్ళీ మారింది. నీ మంచితనాన్ని అర్థం చేసుకుంది. ఈమధ్య నీగురించే మేమిద్దరం చర్చించు కుంటుండేవాళ్ళం. చూడు, బాబూ ! నలుగురూ నాలుగు విధాలుగా రెచ్చగొడతారు. ఆవేశంలో ఆలోచన వుండదు. కాదనను. అయినా కొంత తమాయించుకొనేశక్తి మనలో వుండాలి. అయినా, తప్పటడుగు వేసినతర్వాత, అది తప్పుగా గుర్తించి, పశ్చాత్తాపపడి, మారిన మనిషే నిజమైన మనిషి. ఆరోజు నీప్రవర్తన మూలంగానే హృదియ కాలేజీ మానేస్తాననడం జరిగిందట. కాని, నువ్వు మారావు. పరిస్థితులను అవగాహన చేసుకొని, నేర్పుగా, సమయస్ఫూర్తితో చక్కదిద్దావు. చాలా సంతోషం. ముసలాయన చెప్పుకుపోతూంటే, నాకళ్లు తడపుతున్నాయి. ఒక్క దుడుకున లేచి, అతనిచేతుల్ని పట్టుకొని -

'తాతగారూ ! నన్ను...నన్ను క్షమించండి. మీరు మామూలుమనిషి కాదు. నన్ను అర్థం చేసుకున్నారు. నా కంతేచాలు... అంతేచాలు...' అన్నాను, ఓరగొంతుతో.

'వెళ్ళు, బాబూ! కూచో.'

నేను కుర్చీలోకి జారుకున్నాను.

'బాబూ ! పశ్చాత్తాపం మనిషి మనుగడను పెంచుతోంది. అది మనిషికి మరో జన్మలాంటిది.'

*   *   *

ఆరోజు - హృదియను కలిశాను. కాలేజీనుంచి ఇంటికి వెళ్ళిపోతున్నప్పుడు.

'క్షమించండి. కోపం తెచ్చుకోకండి. మీతో ఫాలో అవుతూ కొన్నివిషయాలు మాట్లాడతాను'. అని చెప్పాను హృదియాతో.

ఆమె ఏమీ అనలేదు.

'ఏమంటారు ?' అడిగాను.

ఊహుఁ. ఈసారికూడా ఏమీ అనలేదు ;

'మౌనం అర్ధాంగీకరం అనుకుంటాను. ఫాలో అవుతున్నాను.'

ఇప్పుడూ మాటాడలేదు ; అయినా, ఆమెతో కలిసే నడుస్తున్నాను నేను.

'మీ తాతగారంటే నాకెంతో అభిమానం. అతను ఎన్నెన్నోవిషయాలు చెప్పుతుంటారు నేనెప్పుడువచ్చిన. అవన్నీ మంచివే. వాటిలో ఎన్నో నేర్చుకోవలసినవి వున్నాయి. ట్రై చేస్తున్నాను. కనీసం కొంతలో కొంతఅయినా అతని అడుగుజాడల్లో నడవాలని' ఆగాను.

చిన్నగా నవ్వింది హృదియ.

'ఎందుకు నవ్వుతున్నారూ ?' అడిగాను.

'మీరు మా తాతగారి మాటలధోరణిని బాగా పట్టేశారు. మీరు మాట్లాడుతూంటే, అతనిమాటలే వింటున్నట్టువుంది'

చిన్నగా నవ్వేశాను.

'నిజంగా మీతాతగారు చాలా క్లుప్తంగా ఏవిషయాన్నైనా మాట్లాడతారు.

ఆమె మౌనంగా వింటుంది.

'మీతాతగారు ఏం చదివారంటా ?'

'ఏమో ;... అన్నివిషయాలగురించిమాత్రం చర్చించగలరు.'

'నిజమే ; నేనావిషయాన్ని గ్రహించగలిగాను.'

హృదియ వీధి రావడంతో ఆమె మలుపు తిరిగింది; 'రండి. ఇంటికి' అంటూ.

'తర్వాత వస్తాను' అంటూ నే నింటిమొహం పట్టాను.

హృదియతో నాపరిచయం పెరుగుతోంది.

ఆమె తాతగారిని వారానికి ఓసారేనా కలుస్తుండేవాణ్ని. అతను ఎన్నెన్నోవిషయాలు చెప్పుతూండేవారు. అతనితో సంభాషించడం అంటే నాకెంతో ఆనందంగా వుంటుంది.

*   *   *

ఆరోజు—

పూదియ తాతగారికోసం వాళ్ళింటికి వెళ్ళాను. కానీ, అతను ఇంటిలో లేరుట ! ఉదయం క్యాంపు వెళ్ళారుట ! పూదియ కూచోమంటే కుర్చీలో కూచున్నాను.

నాకెదురుగా పూదియ కూచుంది, స్టూల్ మీద.

ఎప్పటినించో నామనసులో మెదులుతూన్న ఓ విషయం పూదియ చెవిలో వెయ్యాలని కోరిక కలిగింది. ఆమె ఏకాంతంగా అగుపించడంతో.

'పూదియా ! ఓవిషయం చెప్పనా ?' అడిగాను, కొన్ని క్షణాలాగి.

'చెప్పండి' చిన్నగా నవ్వింది పూదియ.

'సాహసమే చేస్తున్నాను. మరోలా భావించకూడదు. మీకావిషయం రుచించకపోతే, మొహంమీదే తిట్టేయండి. అంతేకాని, మనసులోవుంచుకొని, ఏ తొందరపాటు నిర్ణయం తీసుకోకూడదు.'

'ఫర్వాలేదు. చెప్పండి. ఇప్పుడు మీలో చెడు ఆలోచనలు వుండవని, రావని నానమ్మకం' పూదియ సన్నగా అంది.

నేను కొన్నిక్షణాల మౌనం తర్వాత—

'నామీద మీకెలాంటి అభిప్రాయం ఏర్పడింది ?' అడిగాను, అసలు విషయం అడిగే ధైర్యం చాలక.

గలగలా నవ్వింది పూదియ; 'ముందే చెప్పాగా' అంది.

'అది కాదు'

'మరి ? !'

'అంటే...అంటే..,' మాటలు తడబడుతున్నాయి.

'ఫర్వాలేదు...చెప్పండి.'

తలెత్తి ఆమె కళ్ళల్లోకి చూశాను. ప్రశాంతంగా వుందామె చూపు.

'పూదియా !... ఐలవ్,..యూ,,.' అక్షరాలనుకూడ పలికాను.

కొన్నిక్షణాలు మూగగా వూరుకుంది పూదియ.

ఆమె మౌనం నన్ను ఎంతగానో కలవరపరిచింది.

'క్షమించండి, తొందరపడ్డానేమో...' అన్నాను. నా గొంతులో తడారిపోతోంది,

'మీరు ఆడపిల్లయి పుట్టవలసింది' అంది పూదియ.

'... ... ? ! తలెత్తి ఆమెపంక చూశాను.



'అవును. కాకపోతే అంత బేలతనం పనికిరాదు,' అందిపూదియ.

తల దించుకున్నాను.

'మీనిర్ణయం చెప్పకపోతే నా ఆలోచనలు పరిపరి విధాలుగా పయనిస్తున్నాయి' అన్నాను, ఆగి.

'మరి, నా నిర్ణయం కావాలంటే...నా ఫ్రెండ్ నడగండి. చెప్పింది పూదియ, చిరునవ్వుతో.

'ఫ్రెండా ?' ఆశ్చర్యంగా అడిగాను.

'అవును. అదిగో...అక్కడ వున్నారు...అడగండి.' అంది పూదియ.

ఆమె చూపించినవేపు చూశాను. అక్కడ ఓ అద్దం వుంది. అందులో నాప్రతిబింబం వుంది.

'అంటే...అంటే...' పూదియవంక చూశాను —

పూదియ కిలకిలా నవ్వుతూ వంటగదివేపు పరుగులు తీసింది.

నే నామెను అనుసరించాను.

పూదియ వంటగది తలుపులు మూసేసింది. నేనాగదికి ఇవతల, ఆమె అవతల—మామధ్య ఆ గదితలుపులు అడ్డుగా వున్నాయి.

'థాంక్స్... పూదియా... థాంక్స్...'

'... .... ...'

'ప్లీజ్ ! తలుపులు తియ్యవా ?'

'ఉహుం.'

'ప్లీజ్.'

'ఊహూం.'

'అయితే, మరి. నేపోతున్నా...'

తలుపులు తెరుచుకున్నాయి.

* * *

మా ప్రేమవిషయం బయట పడకూడదని నేను. పూదియ చాలా జాగ్రత్తపడుతూ వస్తున్నాం !

ముఖ్యంగా మా కాలేజీ స్టూడెంట్స్‌కు తెలీకుండా జాగ్రత్త పడుతున్నాం !

మా చదువులు పూర్తి అయినతర్వాత, మా పెద్దలసమక్షంలో, మా పెళ్ళిని జరిపించుకోవాలని మేం నిశ్చయించుకున్నాం.

అందుకే, కాలేజీలో మేం ఏమీకానట్టు ఘూవ్ అవుతుండేవాళ్ళం...తనింటిపద్ద పూదియను కలుస్తుండేవాడ్ని.

* * *

ఆరోజు —

తలవనితలంపుగా ఓ తగాదాలో తలదూర్చాను.

రత్నకుమార్ మా జూనియర్ స్టూడెంట్ లక్ష్మితో ఘర్షణ పడ్డాడు. ఆమె ప్రిన్స్‌పాల్‌కి రిపోర్టు ఇచ్చింది. ప్రిన్స్‌పాల్, రత్నకుమార్‌ను నెలరోజులు కాలేజీకి రావద్దని ఉత్తర్వులు జారీచేగారు, దాంతో రత్నకుమార్ వేడెక్కిపోయాడు. లక్ష్మిమూలంగా తను అవమానం పాలయ్యానని ఫీలయ్యాడు. ఆమెపై ఎలాగైనా పగ తీర్చుకోవాలని పంతం పట్టేడు.

రత్నకుమార్ అనుకున్నది సాధిస్తాడు. వాడ్ని చల్లార్చాలి-ఎలా ?..ఎలా !... అందుకు ఒకటేమార్గం వుంది. తనను క్షమించమని నలుగురిలో రత్నకుమార్‌ను కోరుకోమని లక్ష్మిని రిక్వెస్ట్‌చేస్తాను. అలా అయితే రత్నకుమార్ మళ్ళీ దారిలోకి వస్తాడు. శాంతిస్తాడు. ఆనమ్మకం నాకుంది.

ఆవేళ కాలేజీ గ్రౌండ్స్‌లో లక్ష్మిని కలిశాను. విషయాన్ని చెప్పాను.

అంతే ! ఆమె పాములా బుసలుకొట్టడం మొదలు పెట్టింది.

'మీరెవరండి మధ్యా? వాడొక ఫూల్. వాడిఫ్రెండేగా మీరు !... వాడిబుద్ధులు మీకూ వుండకుంటా పోతాయా...' నోటికి వచ్చింది వాగేస్తోంది లక్ష్మి.

నాలో కోపం గొంతువరకు వచ్చింది. అయినా తమాయించుకుంటున్నాను. కార్యసాధనకోసం ప్రయత్నిస్తున్నాను. ఆమె వినుకోవడం లేదు !

'అబ్బబ్బా ! చూడండీ ! మరోమాట ఆడేరంటే, మిమ్మల్నికూడా ప్రిన్స్‌పాల్‌గారి దృష్టిలోకి తీసుకువెళ్తాను' రుసరుసలాడుతోంది లక్ష్మి.

'రావే ! అతనితో మనకేంటి ?'—లక్ష్మి ఫ్రెండ్స్ తొందరపెడుతున్నారు. లక్ష్మి కదిలింది, వాళ్ళతో కల్సి.

'ప్లీజ్ ! ఆగండి... నామాట వినండి...' అంటూ లక్ష్మికి అడ్డు వచ్చాను.

అంతే ! ఆమె నన్ను ఎలా అర్థం చేసుకుందో, ఏమో, నా బుగ్గమీద దెబ్బవేసింది చేత్తో.

నా అరికాలిమంట నెత్తికెక్కింది.

చుట్టుపక్కల వాళ్ళంతా గోలగా నవ్వుతున్నారు —

అవమానంతో అక్కడనించి కదిలాను, వెర్రివాడిలా.

ఈ సంఘటన ఏలా తెలిసిందో, ఏమో, పూదియకు క్లాసులోకి వెళ్తున్నప్పుడు ప్రక్కకుపిల్చి అడిగింది.

నేనేం చెప్పలేకపోయాను. తల దించుకున్నాను.

'ఛీ ఛీ. నువ్వెందుకు దాంతో తలపడ్డావ్ ?...'

పూదియ చీవాట్లు పెడుతోంది, ఓరగొంతుతో.

(సశేషం)